సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



అక్కయ్యపాలెం హైవే వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతంపేట: విశాఖ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అక్కయ్యపాలెం హైవే వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు ముక్కా కిషోర్, శ్రీదేవి గణపతి ఆటో స్టాండ్ కార్మికులు, సొసైటీ అధ్యక్షులు జి.వామనమూర్తి, ఉపాధ్యక్షులు కేలంశివ, రావికృష్ణ, స్టాండ్ నాయకులు బాలు, శంకర్, ఈశ్వర్, నందీశ్వరరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



అక్కయ్యపాలెం చాకలిపేటలో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో దోమల నివారణకు మంగళవారం సాయంత్రం పలు ప్రాంతాలలో మినీ ఫాగింగ్ నిర్వహించారు. బోరావారి వీధి, లలితానగర్, చాకలిపేట, రామకృష్ణానగర్‌లలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఫాగింగ్ చేశారు. నీటిని నిల్వ చేయకుండా వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది కె.శివ సత్యనారాయణ, ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలకు భాషలే మూలం

ఎంవీపీ కాలనీ: మానవీయ విలువలకు భాషలే మూలాధారమని గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కేఎస్ బోస్ తెలిపారు. సంస్కృతం, హిందీ, తెలుగు భాషల ప్రావీణ్యంపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్‌లో మంగళవారం ఉచిత వర్క్‌షాపు ప్రారంభమైంది. 'ఎన్‌రిచింగ్ హ్యూమన్ వ్యాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్' పేరిట ఈ వర్క్‌షాపు ఈ నెల 18వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఉద్యోగం, సంపాదనే లక్ష్యం కాకూడదని, సమాజంలో విలువలు పెంచే దిశగా కూడా కృషి జరగాలని సూచించారు. భాషల్లో ప్రావీణ్యం ద్వారా సమాజ విలువలు పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అయ్యగారి ఆనంద్, డాక్టర్ వారణాసి వెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి మృతదేహం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ కళాగ్రామం సమీపంలోని వుడా అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ అపార్ట్‌మెంట్‌లో ఓ గది నుంచి దుర్వాసన రావడంతో ఇక్కడ నివాసులు మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకుని గదిలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. సుమారు నాలుగైదు రోజుల క్రితం వ్యక్తి చనిపోయిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శ్యామ్ శివ ప్రసాద్‌గా గుర్తించారు. ఇక్కడకు ఎలా వచ్చాడు. ఎక్కడ నుంచి వచ్చాడు. ఇది హత్యా, ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదని, వివరాలకు భీమిలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ప్రపంచ డెంగ్యూ దినోత్సవం రేపు

మద్దిలపాలెం : జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ డెంగ్యూ దినోత్సవం జరగనుంది. డెంగ్యూ ప్రబలడానికి కారణమైన దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. దీనిలో భాగంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రదర్శనలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఓటర్లు

ఉత్తర నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును గతంలో కంటే కాస్త అధికంగా వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. భానుడు ప్రతాపం చూపినా ఓటర్లు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి యువతరం తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి కనిపించారు. పురుషులు, మహిళలు వృద్ధులు కూడా ఓటు వేసేందుకు తరలి వచ్చారు.



అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్లో బారులు తీరిన ఓటర్లు

- మండుటెండను కూడా లెక్క చేయక ఓట్లు వేసిన ప్రజలు
- ఈ దఫా 64.63 శాతం పోలింగ్
- 2019లో 62.65 శాతం
- గతంతో పోలిస్తే 1.98 శాతం అధికం

సీతంపేట : ఉత్తర నియోజకవర్గం ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఈసారి ఎన్నికల్లో 64.63 శాతం పోలింగ్ జరిగింది. 2014 ఎన్నికల్లో 59.91 శాతం పోలింగ్ జరగ్గా, 2019 ఎన్నికల్లో 62.65 శాతంగా నమోదు అయింది. ఈసారి దాదాపు రెండు శాతం ఓటింగ్ పెరగడం విశేషం. మండుటెండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి యువత, మహిళలు, కొత్త ఓటర్లు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,85,789 మంది ఓటర్లు ఉండగా, 1,84,703 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 90,124 మంది కాగా, మహిళలు 94,566 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. పురుషుల కంటే 4,442 మంది మహిళా ఓటర్లు అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.

ప్రశాంతంగా పోలింగ్...

నియోజకవర్గంలోని 275 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఉదయం పోలింగ్ నెమ్మదించడంతో క్యూలైన్‌లో జనం బారులు తీరారు. కొన్ని కేంద్రాల్లో రాత్రి 10.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ మందకొడిగా సాగినప్పుడు గంటల తరబడి మండుటెండలో నిలబడి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు రాత్రి 10.30 గంటల వరకు ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్, తిక్కవానిపాలెం, రాంజీ ఎస్టేట్, అతిథి ఫంక్షన్‌హాల్ కేంద్రాల్లో రాత్రి 10.30 వరకు పోలింగ్‌కు అవకాశం కల్పించారు.

ఉత్తరలో 2009 నుంచి 2024 వరకు పోలింగ్ శాతం..

2009లో	67.81 శాతం
2014లో	59.91 శాతం
2019లో	62.65 శాతం
2024లో	64.63 శాతం

ఘనంగా ముగిసిన జట్లమ్మ ఆలయ వార్షికోత్సవం



జట్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ ట్రస్టు చైర్మన్ పవన కుమార్ వర్మ



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జట్లమ్మ ఆలయ మూడో వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నవ గ్రహ, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, సర్వ భద్రతో మండపాలకు మంత్ర ఆవాహన పారాయణ హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. దీనిలో భాగంగా చిడతలు తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టు చైర్మన్ రాజాసాగి పవన కుమార్ వర్మ, పాండ్రంగి కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ ట్రస్టు చైర్మన్ రాజాసాగి దేముడు బాబు, కొసర అప్పలనాయుడు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

23న వైశాఖ పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

సీతంపేట: వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో విశేష పూజలు చేయనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 7.30 గంటలకు రమా సత్యనారాయణ స్వామికి పంచామృత అభిషేకం, మణిద్వీపంలో శ్రీచరఖ వనావరణ, అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు పీఠంలో రాజశ్యామల హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలిచే భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరోగ్య 'యోగం'

- చిన్నారుల యోగా శిబిరానికి మంచి స్పందన
- ఏకాగ్రత పెంచేలా యోగాసనాల్లో తర్ఫీదు
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు







యోగాసనాలు సాధన చేస్తున్న చిన్నారులు (అంతర చిత్రం) ప్రాణాయామంపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

ఏయూ క్యాంపస్: యోగా సాధన ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెంచుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవుల్లో భాగంగా ఏయూ యోగా విలేజ్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిబిరానికి విశేష స్పందన లభించింది. రోజూ ఉదయం వేళ ఒక గంట సమయం చిన్నారులు యోగాసనాలు, ప్రాణాయామం వంటివి అభ్యసించడానికి కేటాయిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారు కావడానికి ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

సూక్ష్మ వ్యాయాయం

నిత్యం 10 నుంచి 15 నిమిషాలు సూక్ష్మ వ్యాయామం చేయిస్తారు. తద్వారా శరీరంలో ప్రతీ అవయవాన్ని యోగాసనాలు వేయడానికి సిద్ధం చేయడం జరుగుతుంది.

బ్యాలన్సింగ్

చిన్నారుల్లో స్థిరత్వాన్ని కల్పించడానికి ఉపకరించే నటరాజ ఆసనం, త్రికోణాసనం, ఏకపాద ఆసనం, వంటివి నేర్పుతున్నారు.

- కంటికి బలాన్ని అందించేలా త్రాటక వ్యాయామం చేయిస్తున్నారు. నేత్ర సమస్యలను నివారించడానికి, కంటి చూపు మెరుగవడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.
- శరీరంలోని అవయవాలను అనుసంధానం చేస్తూ, శరీరానికి అవసరమైన సంపూర్ణ వ్యాయామాన్ని అందించేలా సూర్యనమస్కారాలు సాధన చిన్నారులు రోజూ చేస్తున్నారు. వీటి వల్ల శ్వాస, జీర్ణ వ్యవస్థలు మెరుగవడం, శరీరంలో ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది.
- వెన్నును బలోపేతం చేసే విధంగా భుజంగాసనం, దండాసనం తదితర ఆసనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా రక్త ప్రసరణ వ్యవస్థను ఇవి చైతన్యవంతం చేస్తాయి. మజిల్స్, జీర్ణ వ్యవస్థకు దోహదపడే ధనురాసనం నేర్పిస్తున్నారు.
- మనస్సుకు స్థిరత్వాన్ని ఇచ్చే ప్రాణాయామం, ఓం కారం సాధన వంటివి చివరగా చేయించడంతో రోజువారి శిక్షణ పూర్తవుతుంది.

సమాజంతో అనుసంధానం చేసేలా..



ఏయూ యోగా విలేజ్‌ని సమాజంతో అనుసంధానం చేసేలా పని చేస్తున్నాం. దీనిలో భాగంగా అధికారులు సూచించిన విధంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత యోగ శిబిరానికి మంచి స్పందన లభించింది. చిన్నారులు ఎంతో ఆసక్తితో వస్తున్నారు.

– ఆచార్య కె.రమేష్‌బాబు, విభాగాధిపతి

యోగా చాలా బాగుంది..



యోగా విలేజ్‌లో శిక్షణ చాలా బాగుంది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇంటి దగ్గర సాధన చేస్తున్నాం. ఎంతో ఓపికగా నేర్పిస్తున్నారు. ఏకాగ్రత పెరగడానికి, బాగా చదవడానికి, శారీరక వ్యాయామానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తాయి.

– సమన్విత, విద్యార్థిని

ఏకాగ్రత పెరిగింది..



ఇక్కడ నిత్యం యోగా సాధన చేయడం వల్ల నాలో ఏకాగ్రత పెరిగింది. అదే సమయంలో కోపం, చిరాకు వంటివి బాగా తగ్గడం గమనించాను. ఒక విధమైన ప్రశాంత యోగాతో కలుగుతోంది.

– ఉమామహేశ్వరి, మద్దిలపాలెం

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు..



చిన్నారులు ఎంతో ఆసక్తిగా యోగాసనాలు నేర్చుకుంటున్నారు. ఎంతో కష్టమైన ఆసనాలను సైతం సులభంగా వేస్తున్నారు. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. విభాగ ఆచార్యుల పర్యవేక్షణలో చిన్నారుల్లో ఏకాగ్రత పెంచే ఆసనాలు నేర్పించడం జరుగుతోంది.

– యామిని, పీజీ విద్యార్థిని, ఏయూ యోగా విలేజ్

ఘనంగా శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్ద బేరి గురుమూర్తిరెడ్డి తదితరులు



ఉత్సవాలలో భాగంగా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

సీతమ్మధార : రేసవానిపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు కుంకుమలు, ఫల పుష్పాలు ఇత్యాది కానుకులు సమర్పించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సేవ గరిడీ, పులివేషాలు, నేల వేషాలతో అమ్మవారి అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేసవానిపాలెం గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, సెక్రటరీ జీరు అప్పలస్వామిరెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఉత్తర'లో విజయం తథ్యం

- సీఎంగా జగన్ రెండో సారి ప్రమాణ స్వీకారం చేస్తారు
- ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు



పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు

సీతమ్మధార : సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె. రాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఎంతో శ్రమించి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. వార్డుల వారీగా పోలైన ఓట్ల వివరాలు, పార్టీకి ఉన్న ఆదరణ తదితర అంశాలను పార్టీ శ్రేణులతో చర్చించారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి రెండవ పర్యాయం కూడా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. త్వరలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందన్నారు.

బౌద్ధాలయంలో అంబేడ్కర్ జయంత్యుత్సవం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం : కంచరపాలెం పరిధి అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం ప్రధాన కార్యదర్శి కె. రాజు గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంబేడ్కర్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేసిన అంబేడ్కర్ ఆశయం సాధన ఎంతో గొప్పదని పేర్కొన్నారు. వృద్ధులకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమారావు, ఏఎం ఫ్రెడ్డీ, సీహెచ్ బాబూరావు, సూరి, జి.రాజు, పరిమిళ, సత్య, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వేచ్ఛ



తయారు చేసిన బ్యాగులను ప్రదర్శిస్తున్న మహిళలు

మురళీనగర్: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక స్వేచ్ఛను సాధించవచ్చని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వి.నిర్మల అన్నారు. మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జ్యూట్ బ్యాగుల తయారీ ఉచిత శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వద్దనే ఉండి ఉపాధి పొందేందుకు ఇటువంటి శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. 12 రోజుల పాటు జరిగిన వేసవి ఉచిత శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న 18 మంది మహిళలు తాము తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు సుగుణ, అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్, ఉపాధ్యక్షుడు డి.వరప్రసాద్, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, ఉప కార్యదర్శులు పి.సంతోష్‌కుమార్, పి.సతీష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీ వర్మ, ఉపకోశాధికారి పి.వెంకటరావు, ఇతర కార్యవర్గ సభ్యులు వై.త్రిమూర్తి, పి.గిరిధర్, పీఎస్ఆర్ శ్రీనివాస్, ఎస్ఎస్‌వీ ప్రసాద్, ఢిల్లేశ్వరరావు, ఎం.శ్రీహర్ష పాల్గొన్నారు.

ప్రజా మద్దతుతో ప్లాంటును రక్షించుకుంటాం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1188వ రోజుకు రిలే దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థకు అప్పగించడానికి తలో చేయి వేసి సహకారం అందిస్తున్నారని, అదే నేడు ఈ దుస్థితికి కారణమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1188వ రోజు శిబిరంలో వారు మాట్లాడారు. గంగవరం పోర్టు యాజమాన్యం సృష్టిస్తున్న అవరోధాలు, అడ్డంకులు ప్రజల సహకారంతో ఎప్పటికైనా తొలగిపోతాయన్నారు. కుట్రలెన్ని చేసినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించలేరన్నారు. ప్రజలు తలచుకుంటే పాలకులే కాదు, ఏ పారిశ్రామికవేత్తలు, తొత్తులు నిలబడలేరన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.రామ్మోహనకుమార్, డి.శ్రీనివాస్, జి.నరేంద్ర, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు





వస్త్రాలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి, మామిడిపండ్లు, చామంతులతో మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం వస్త్రాలంకరణలో భాగంగా కోన శ్రీనివాస్, నవ్య బహూకరించిన చీరతో అలంకరించారు. అలాగే వీళ్ల అమ్మవారి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మామిడిపండ్లు, చామంతులు, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు గాను కృష్ణంరాజుపేటకు చెందిన బమ్మిడి నరసింగరావు, మంగ సహకరించగా భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com